# <u>పత్రికా ప్రకటన</u>

తేది.02.07.2017.

## <u>వైద్యుడిని కిడ్నాప్ చేసిన ఐదుగురు నిందితుల అరెస్ట్</u>

యువతిని ఎరగా ఉపయోగించడం ద్వారా ఒక వైద్యుడిని నమ్మించి కిడ్నాప్‌కు పాల్పడిన ఐదుగురు నిందితులను విజయవాడ పోలీసు కమీషనర్ శ్రీ గౌతం సవాంగ్ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు ఇన్‌ఛార్జ్ డిసిపి-1 శ్రీ క్రాంతి రాణా ఐపిఎస్ మరియు డిసిపి డా.గజరావు భూపాల్ గారి పర్యవేక్షణలో సెంట్రల్ జోన్ ఏసిపి శ్రీ సత్యానందం ఆధ్వర్యంలో మాచవరం ఇన్‌స్పెక్టర్ శ్రీ ఉమామహేశ్వరరావు, వారి పోలీస్ సిబ్బందితో కలసి ది.2.7.17న అరెస్ట్ చేయడం జరిగింది.

నగరంలో ప్రముఖ దయాబెటీస్ వైద్యుడయిన మాలెంపాటి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి వద్ద 2016వ సంవత్సరంలో కాకి విద్యాసాగర్ అనే వ్యక్తి కారు డ్రైవర్‌గా కొంత కాలం పని చేసి మానేశాడు. సులభంగా డబ్బు సంపాదిచాలనుకుని విద్యాసాగర్ నిర్ణయించుకున్నాడు. ఇందుకు గతంలో తాను పని చేసిన వైద్యుడు మాలెంపాటి వెంకటేశ్వరరావును ఎంచుకుని ఆయన్ను కిడ్నాప్ చేయడం ద్వారా డబ్బులు సంపాదించాలనుకుని తన స్నేహితులైన (1) మూల్పూరు రంజిత్‌కుమార్, (2) డొక్కు నాగదిలీప్ అలియాస్ దీపు (3) మూల్పూరు బెనర్జి అనే వ్యక్తులను కలుపుకుని ఒక పథకం పన్నారు. పథకరచనలో భాగంగా ఒక మహిళను క్విక్కర్ అనే ప్రచార మాధ్యమం ద్వారా ప్రకటన ఇచ్చి రియల్‌ఎస్టేట్ ఆఫీస్‌లో పర్సనల్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో నియమించుకున్నారు. ఆమెకు డబ్బు ఆశచూపి ఆమెను డాక్టర్ వెంకటేశ్వరరావు వద్దకు పేషెంట్‌గా పంపారు. వైద్యునితో సన్నిహితంగా మెలుగుతూ ఆయనతో పరిచయం పెంచుకున్న ఆ మహిళ ద్వారా డాక్టరుకు ఫోన్ చేయించి "ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్"పై సెమినార్ ఉందని డాక్టర్‌ను ది.28.6.17న మధ్యాహ్నం 3 గంటలకు ముందుగా రచించిన పథకం ప్రకారం రామవరప్పాడు రింగు వద్దకు పిలిపించారు. అనంతరం అక్కడి నుండి తన ఇల్లు దగ్గరలోనే ఉందని నమ్మించిన ఆ మహిళ మరియు బెనర్జిలు డాక్టర్‌ను నారాయణపురం కాలనీలో ఉన్న ఒక ఫ్లాట్‌కు కారులో తీసుకువెళ్ళారు. అక్కడ మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్‌ను డాక్టర్‌తో తాగించి స్పృహ కోల్పోయిన డాక్టర్‌ను కాకి విద్యాసాగర్, మూల్పూరు రంజిత్‌కుమార్, డొక్కు నాగదిలీప్ కుమార్, మూల్పూరు బెనర్జి మరియు మహిళ కలసి వీరవల్లి గ్రామం పొలాల్లో ఉన్న ఒక షెడ్డులో డాక్టర్‌ను కాళ్ళు, చేతులు కట్టి నిర్భందించారు. అనంతరం ఆయన వద్ద ఉన్న సెల్‌ఫోన్‌ను లాక్కుని, అక్కడ డాక్టర్‌కు కాపలాగా బెనర్జి మరియు దిలీప్‌లను నియమించారు. ది.29.6.17న డాక్టర్ కుమారుడైన మాలెంపాటి రాజేష్‌కు ఫోన్ చేసి తన తండ్రిని కిడ్నాప్ చేసినట్లు, రూ.30 లక్షలు ఇవ్వాలని లేదంటే తన తండ్రిని హత్య చేస్తామని బెదిరించారు.

జరిగిన సంఘటపై డాక్టర్ కుమారుడైన రాజేష్ మాచవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగింది. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కేసును అన్ని కోణాల్లో పరిశోధించి నిందితులను గుర్తించడం జరిగింది. <u>**(1) విజయవాడ అశోక్‌నగర్‌కు చెందిన కాకి విద్యాసాగర్ (33), (2) హనుమాన్ జంక్షన్‌కు చెందిన మాల్పూరు రంజిత్‌కుమార్ (31), (3) విజయవాడ రామకృష్ణాపురానికి చెందిన మహిళ (24), (4) హనుమాన్ జంక్షన్ బోయపాటివారి వీధికి చెందిన మూల్పూరు బెనర్జి (29) మరియు (5) విజయవాడ పడవలరేవుకు చెందిన డొక్కు దిలీప్‌మార్ (25)లను**</u> ది.01.07.17న అరెస్ట్ చేయడం జరిగింది.

ఈ కేసులో నిందితులను త్వరితగతిన పట్టుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడంతో పాటు ఆరు ప్రత్యేక బృందాలతో సైబర్‌సెల్, టాస్క్‌ఫోర్స్, సిసిఎస్, స్థానిక పోలీసు బృందాలను వినియోగించడం జరిగింది. కిడ్నాప్ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను త్వరిత గతిన పట్టుకుని విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులకు మరియు సిబ్బందిని నగర పోలీస్ కమీషనర్ గారు అభినందించి రివార్డును ప్రకటించడం జరిగింది.

గుర్తు తెలియని వ్యక్తులతో మరియు సోషల్ మీడియా ద్వారా పరిచయం అయిన వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా మహిళలు ఇటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేస్తున్నాము.

-- xx --